# శృంగార నాయికలు విప్రలబ్ధ

-చంద్రం-




**పోస్ట్‌మన్** అందించిన ఉత్తరం తీసుకొని గదిలోకి పరుగెత్తింది రాధ.

"ఎక్కణ్ణుంచేఉత్తరం?" అన్న తల్లి ప్రశ్నకు — "అక్కణ్ణుంచేలే" అని సమాధానం చెప్పింది.

'అక్కణ్ణుంచే' అంటే అల్లుడి దగ్గిర నించేనని ఆవిడకు అర్థమై పోయి, చిన్నగా నవ్వుకుంది.

రాధ వచ్చి పట్టుమని పది రోజులైనా కాలేదింకా. అప్పుడే అయిదవ ఉత్తరం ఇది. చైత్ర మాసంలో పెళ్ళి అయింది. వైశాఖంలో కాపురానికి పంపించారు. జ్యేష్ఠం పూర్తి కాక ముందే ఆషాఢానికి తీసుకు వచ్చేశారు. పది రోజుల్లో అయిదు ఉత్తరాలు. అటునించి రావటమే కాదు— ఇటు నించి రాధ కూడా అన్ని ఉత్తరాలూ వ్రాసింది. రోజూ పోస్టుమన్ వచ్చే సమయానికి వీధి గుమ్మంలో నిలబడి ఎదురు చూస్తుంది. ఉత్తరం రాని రోజున నిరుత్సాహ పడుతుంది. చిర్రు బుర్రులాడుతుంది. వచ్చిన రోజున మహదానంద పడిపోతుంది. పదే పదే చదువుకుంటుంది. సమాధానం వ్రాస్తుంది. రోజంతా ఉత్తరంతోనే సరిపోతుంది.

కూతురు ప్రవర్తన చిత్రంగా కనిపిస్తుంది అనసూయమ్మకు. ఎంత కొత్త దంపతులైతే మాత్రం ఇంత ఆత్రమా! అయినా, అంత తరుచుగా వ్రాసుకోవటానికి విషయాలేముంటాయి? ఆవిడ తన పాతికేళ్ళ దాంపత్య జీవితంలో ఒక్కసారి కూడా భర్తకు ఉత్తరం వ్రాయలేదు. ఆయనమాత్రం ఒకటి రెండు సార్లు తను పుట్టింట్లో ఉన్నప్పుడు తన పేర ఉత్తరం వ్రాయటం జరిగింది. ఉత్తరం అంటే ఎలాగ? వీళ్ళకు మల్లే కవర్లలో తావులు కొద్దీ కాగితాలు కుక్కటం కాదు. కార్డు ముక్క మీద నాలుగు పొడి మాటలు— కుటుంబ వ్యవహారాలకు సంబంధించినవి వ్రాసి పారెయ్యటం అంతే! మరి వీళ్ళేం వ్రాసుకుంటారో తెలియదు.

ఆ రోజుల్లో ఆషాఢ మాసం అంటే ఎంత పట్టింపుగా ఉండేదని! ఆలుమగలు విడివిడిగా ఉండటమే కాదు, ఉత్తరాలు కూడా వ్రాసుకొనేవారు కాదు. ఉత్తరాలు వ్రాసుకోవటాన్ని శాస్త్రం నిషేధించిందో, లేదో తనకైతే తెలియదు కాని, తనకు తెలిసినంత వరకు తమ కుటుంబాల్లో ఎవ్వరూ వ్రాసుకొనేవారు కాదు. ఎవరి సంగతో ఎందుకు? తను వ్రాయలేదు. భర్త వ్రాయలేదు. అయినంత మాత్రాన తమది మాన్య దాంపత్యం కాక పోయిందా? పరస్పరాకర్షణ లేక పోయిందా? తాము తెగించి ఉత్తరాలు వ్రాసుకోలేదు కాని, ఒక వేళ వ్రాసుకొని ఉన్నట్టయితే తమ తమ పెద్దలు ఎన్నో రాద్ధాంతాలు, సిద్ధాంతాలు చేసి ఉందురు! ఆ రోజులు వేరు. అప్పటి పరిస్థితులు వేరు. అప్పటికీ, ఇప్పటికీ ఎన్నో మార్పులు వచ్చేసినాయి. కట్టుబాట్లలో సడలింపులు కనిపిస్తున్నాయి. పెద్దలనుకున్న వాళ్ళే పట్టించుకోవటం లేదు. ఇంక పిల్లల్ని అనుకోవటం అనవసరం. గట్టిగా మాట్లాడితే ఆషాఢమే లేదు, పొమ్మంటారు. ఇవన్నీ మూఢాచారాలంటారు. అలా అంటున్న వాళ్ళను ఎవ్వరేం చెయ్యగలుగుతున్నారు కనక! ఈ కట్టుబాట్ల వ్యవహారంలో తెగేదాకా లాగటం కన్న, చూసీ చూడనట్టుగా పోవడమే శ్రేయస్కరంలా కనిపిస్తుంది. ఆలుమగల మధ్య అన్యోన్యం ముఖ్యం కాని ఆషాఢాలూ శ్రావణాలూ ముఖ్యం కాదు కదా!

కూతురూ, అల్లుడూ అంతంత ఉత్తరాల్లో ఏం వ్రాసుకొంటున్నదీ అర్థం కాకపోయినా, ఆ ఉత్తరాల వల్ల వాళ్ళిద్దరి మధ్య ఎంతో అన్యోన్యం గాఢానురాగం ఉన్నట్టుగా అనసూయమ్మకు అర్థమైంది. అందుకు తృప్తి పడింది.

గదిలో మంచం మీద పడుకొని కవరు చించింది రాధ. అందులో ఒక్క ఠావే ఉంది. కనీసం రెండు ఠావులైనా లేనందుకు కొంచెం నిరుత్సాహపడింది రాధ. అయినా, ఆత్రతగా చదవ సాగింది.

"డియర్ రాధా!" అంటూ ప్రారంభమైన ఆ ఉత్తరం మరుక్షణంలోనే రాధకూ, బాహ్య ప్రపంచానికీ మధ్య సంబంధం తెంచి వేసింది. ఊహల రెక్కల మీద కూర్చో బెట్టుకుని, విచిత్ర భావ లోకాల్లో విహరింప జేసింది. ఉత్సాహం, ఉద్రేకం తరంగాల స్థాయిలో అనుభవించింది రాధ. అఖరికి ఆనందం పట్టలేక—"అమ్మోయ్" అంటూ గట్టిగా కేకవేసింది.

ఏమిటో అనుకుని కంగారు పడుతూ వచ్చిన అనసూయమ్మ—" ఏమిటమ్మా? ఏమయింది?" అనడిగింది ఆత్రతగా.

"ఏమీ లేదులే!" అనేసింది రాధ.

ఉత్తరం ఇంకా రాధ చేతిలో ఉండటం చూసి, అంతా దాని మహిమేనని అర్థం చేసుకుంది అనసూయమ్మ. 'ఏమిటో పిచ్చి పిల్ల!' అనుకొంటూ వదిలి వచ్చిన పనికి వెళ్ళి పోయింది.

ఉత్తరం చివర ఉన్న వార్త—కాదు, కాదు. శుభవార్త ఉక్కిరి బిక్కిరి చేసేసింది రాధను. ఆమె కలలోనైనా ఊహించని వార్త అది. ఈ నెల రోజుల్లోనూ అలాంటిది సంభవమవుతుందని ఆమె అనుకోలేక పోయింది. ఏది అసంభవమని తను తలచిందో అదే ఇప్పుడు సంభవం కాబోతూంది. మనసు ఉంటే మార్గమే లేక పోతుందా? అంటారు ఇందుకే కాబోలు. 'మధూ డియర్ యువార్ ఎ జీనియస్!' అని భర్తను మెచ్చుకోకుండా ఉండలేక పోయింది రాధ. ఉత్తరంలో ఆ వార్త ఉన్న చోట పదే పదే ముద్దు పెట్టుకుంది.

రాధను అంతగా సంతోష పెట్టిన ఆ శుభ వార్త ఏమిటంటే, 'బుధవారంనాడు మధ్యాహ్నం ఖచ్చితంగా రెండు గంటల పదిహేను నిమిషాలకు వెంకటేశ్వర టాకీస్ దగ్గరికి రా. ఆ సమయానికి అయిదు నిమిషాలు అటూ ఇటూగా నే నక్కడికి వస్తాను. ఎవరో ఒక స్నేహితురాలితో కలిసి మాటినీకి వెళుతున్నట్టు ఇంటి దగ్గర చెప్పి రా. మనం సినిమా చూసేదీ, మరేం చేసేదీ అప్పటి పరిస్థితిని బట్టి ఆలోచిద్దాము. మాటినీ వదిలే వేళకు నువ్వు ఇంటికీ, నేను బస్సుకూ — మధు'— ఇదీ కథ!

బుధవారం అంటే ఆ రోజే!

సమయం పన్నెండు గంటలు అయింది.


ఉదయం మామూలుగా స్నానం చేసింది రాధ. అయినా, బాత్‌రూములో దూరి మళ్ళీ స్నానం చేసింది. పెట్టెలోని చీరెలూ, జాకెట్లూ అన్నీ బయటికి తీసి అరగంట కష్టపడి ఒక జత ఎన్నుకుంది. తీరా కట్టుకుని అద్దంలో చూసుకుంటే అవి నచ్చలేదు ఆమె కంటికి. మరోక జత తీసి కట్టుకుంది. అవీ నచ్చలేదు. మరోక జత తీసుకుంది. తల దువ్వి, జడ అల్లుకోవడంలో కూడా అంత హడావుడీ చేసింది.

ఈ హడావుడి అంతా గమనించిన అనసూయమ్మ- "ఎక్కడికీ ప్రయాణం?" అనడిగింది అనుమానంగా.

"మాటినీకి, అమ్మా! నిన్న సుజాత మన ఇంటికి వచ్చిందిగా? అదీ, నేనూ ఈవేళ మాటినీకి వెళ్ళాలనుకున్నాము కాని, ఆ విషయం మరిచే పోయాను. ఇప్పుడే గుర్తు వచ్చింది."

నిన్న సుజాత వాళ్ళ ఇంటికి రావటం నిజమే. కాబట్టి మాటినీకి వెళ్ళాలనుకోటం కూడా నిజమేననుకొన్న దావిడ. అందుకనే "ఇంకా వేళ కాలేదుగా? కంగారెందుకూ? నెమ్మదిగా బయలుదేరి వెళ్ళు" అనేసింది.

రాధ అలంకరణ పూర్తయ్యే సరికి రెండు గంటలయింది. నిజం చెప్పాలంటే ఆమె అలం



కరణ ఇంకా పూర్తి కాలేదు. కాని, వేళ దగ్గర పడి పోవటం వల్ల పూర్తి అయిందని పించుకొని బయలు దేరింది.

సందు దాటి వీథిలోకి వచ్చి, రిక్షా పిలిచి ఎక్కేసింది.

చేతి గడియారం రెండూ పది నిమిషాలు చూపిస్తూండగా వెంకటేశ్వర టాకీస్ ముందు రిక్షా దిగింది రాధ.

అందులో ఆడుతున్నది కొత్త చిత్రం. బుకింగులు రద్దీగా ఉన్నాయి. బాల్కనీ టికెట్లు అమ్మే చోట కూడా క్యూ ఏర్పడింది.

థియేటర్ మెయిన్ గేటు దాటి లోపల ప్రవేశించి బాల్కనీ బుకింగు దగ్గర కాస్త వారగా, నీడ పడేచోట నిలబడింది రాధ.

అందరి దృష్టి సినిమా టిక్కెట్ల మీద ఉంటే, రాధ దృష్టి మెయిన్ గేటు మీద ఉంది.

అయిదు నిమిషాల్లో పదిహేనుసార్లు చూసుకుంది గడియారం వంక. ఆమె కంగారే కాని, గడియారానికి కంగారా! నిర్ణీత సమయానికి తను విధ్యుక్త ధర్మాన్ని అనుసరించి రెండూ పదిహేను నిమిషాలు చూపించినాయి గడియారం ముళ్ళు.

రాధకు ఆత్రత ఎక్కువై పోయింది. నిలుచున్న చోట కాళ్ళు నిలవటం లేదు. గేటులోకి వచ్చి అటూ ఇటూ పరికించ సాగింది. క్షణాలు గడుస్తున్న కొద్దీ ఆత్రత అధికమై పోసాగింది.

నిరీక్షణలో క్షణాలు యుగాలుగా అనిపిస్తున్నాయి.

ఎండ తీక్ష్ణంగా ఉంది. కింద చెప్పులు ఉన్నాయి. కాని, పైన ఆచ్ఛాదన లేదు. మళ్ళీ వెనక్కు వెళ్ళి నీడలోనే నిలబడింది రాధ. గడియారం వంకా, గేటు వంకా మార్చి మార్చి చూడసాగింది.

రెండున్నర !

బాల్కనీ, ఫస్టు క్లాసు బుకింగులు మూసేసి, హౌస్‌ఫుల్ బోర్డులు తగిలించేశారు. నేల, బెంచీ బుకింగులు మరోక పక్క ఉన్నాయి. అవీ మూసేసి నట్టున్నారు — జనం పలచబడి పోతున్నారు.

గేట్లు మూసేసి, మాటినీ ప్రారంభించారు.

ఇంకా అక్కడ ఒంటరిగా నిలుచోవటం మంచిది కాదని నెమ్మదిగా బయటికి వచ్చింది రాధ. ఆమె కంతా అయోమయంగా ఉంది. అతను వ్రాసిన టైము రెండు గంటల పదిహేను నిమిషాలే. ఇప్పుడు రెండూ ముప్పావైంది. ఒక వేళ తన గడియారం తప్పు చూపిస్తుందనుకున్నా, మాటినీ ప్రారంభించేశారు కనక రెండున్నర దాటినట్టే లెక్క. మరి రాకపోవట మేమిటో?

అక్కడికి దగ్గరలోనే బస్‌స్టాండు ఉంది. సాలోచనగా అటు అడుగులు వేసింది రాధ.

పిట్ట మధ్యాహ్నం కనక ప్రయాణికుల ఒత్తిడి అంతగా లేదు. స్టాండులోని బెంచీలు, ప్లాట్‌ఫారాలు ఖాళీగా ఉన్నాయి. ఎదురు ఎదురుగా మనుషులు, ఆ పక్క ఒక బస్సు, ఈ పక్క ఒక బస్సు — అంతకుమించి సందడి ఏమీ లేదు.

తిన్నగా 'ఎంక్వయిరీస్' వైపు నడిచింది రాధ. ఆ వూరి నించి రావలసిన బస్సు ఎన్నింటికో వాకబు చేసింది. గంట గంటకూ ఒక బస్సు ఉందని తెలిసింది.

''ఇంతకుముందు రావలసిన బస్సులన్నీ సక్రమంగా వచ్చేసినాయా?'' అని అడిగింది రాధ—కారణాంతరాల వల్ల మధు ఎక్కిన బస్సు మార్గ మధ్యంలో ఎక్కడన్నా ఆగిపోయి ఉందేమో నన్న అనుమానంతో.

ఎంక్వయిరీస్ ఉద్యోగి కళ్ళద్దాల పై నుంచి ఒకసారి, క్రింద నుంచి ఒకసారి రాధ వంక ఎగాదిగా చూసి, ''మీ దయ వల్ల అన్ని బస్సులూ సక్రమంగా, సకాలంలోనే వచ్చేసినాయమ్మా!'' అని సమాధానమిచ్చాడు.

ఏం చెయ్యాలో అర్థం కాలేదు రాధకు.

ఒకసారి ప్రయాణికులు కూర్చునే చోట్లన్నీ గాలించింది.

మధు జాడ లేదు.

మళ్ళీ వెంకటేశ్వర టాకీస్ దగ్గరికి వచ్చి చూసింది.

మాటినీ జరుగుతూంది కనక మెయిన్ గేటు


# పైపై చికిత్సలు మొటిమల మూలకారణాన్ని పోగొట్టలేవు.

యోగా లాగానే రక్త దోషాంతక్ అంతర్గత ప్రశాంతతను కలిగిస్తుంది.
మొటిమలు లేని అందాన్ని యిస్తుంది.

రక్తదోషాంతక్ యోగా లాగానే గొప్ప సాంప్రదాయం గల ఆయుర్వేదం నుంచి తయారైంది. మొటిమలు, చీడుము, చర్మంమీద మచ్చలు : ఈ వ్యాధుల బాహ్య లక్షణాలను పోగొట్టటంకంటె వాటి మూలకారణాన్ని కనుక్కోవటం ముఖ్యం

**అసమన్వయం :** యోగా లాగానే రక్తదోషాంతక్ కూడా శరీరపు పనులలోని అంతర్గత అసమన్వయం రక్తాన్ని మలినం చేస్తుందని నమ్ముతుంది. ఈ రక్త మాలిన్యమే అందాన్ని పాడుచేసే మచ్చలను చర్మంమీద కలిగిస్తుంది. ఈ సమస్యకి ఆయుర్వేదపు అన్వేషణ ప్రకృతి సిద్ధమైన ఉపశమనతో కూడిన సమాధానాన్ని కను గొంది — మూలికలతో కూడిన అంతర్గతమైన చికిత్స. అదే రక్తదోషాంతక్.



**సమన్వయాన్ని కలిగించటం :** మీ విశ్వాసానికి పాత్రమైన యీ ఆయు ర్వేదపు మందు లోని మూలికలు, జీర్ణ క్రియ, బాహ్యక్రియ. రక్త ప్రసరణ వంటి శరీరంచేసే ముఖ్యమైన పనులను సరిచేసి మీకు అంతర్గత ప్రశాంతతను, చర్మ సౌందర్యాన్ని కలిగిస్తాయి. కాని, ప్రతిరోజూ చెప్పబడిన మోతాదులో రక్త దోషాంతక్‌ను వాడి తీరాలి. అంతేకాదు. మీ చర్మం సహజ సౌందర్యాన్ని పొందాక కూడా యింకా కొంతకాలం యీ చికిత్సను కొన సాగించటం ఎంతో ముఖ్యం. మీ శరీరం అంతర్గత ప్రశాంతతను తనంతట తానే కలిగించుకునేవరకూ.

## రక్త దోషాంతక్

మచ్చలు లేని చర్మ సౌందర్యానికి.
నికార్సైన ఆయుర్వేదపు రక్త శుద్ధ కారిణి




A
ఆఫాలి
ఫార్మస్యూటికల్స్
లిమిటెడ్
1184/4. శివాజీనగర్.
పూనా 411005
టెలిఫోన్ నం. 51108.

everest/80/APL/428/tl

కూడా మూసేశారు.

మధు ఎందుకు రాలేదో?

ఊహ కందని విషయం అయింది రాధకు.

జోక్ చేశాడనుకోవటానికి వీల్లేదు— హాస్యానికి కూడా కొన్ని హద్దు లుంటాయి కనక.

ఇంతకూ అతను వస్తానన్నది బుధవారం నాడేనా?

సందేహ మెందుకు? బుధవారంనాడే! ఎన్నో సార్లు చదివింది కదా!

ఒక వేళ తనే కంగారులో వారం పేరు తప్పు వ్రాశాడేమోనని అనుకోవటానికి కూడా అవకాశం లేదు — తారీకు కూడా వేశాడు!

మరి ఎందుకు రానట్టు?

ఎవరు తీరుస్తారు ఈ సందేహం?

పదిరోజుల వియోగం తరవాత ప్రియ భర్తను సందర్శించే అవకాశం లభిస్తుందన్న వూహే అనిర్వచనీయమైన ఆనందాన్ని కలిగించింది రాధకు. అయితే, ఆ వూహ నిజమయ్యే అదృష్టం ఆమెకు లేకపోయింది.

శరీరమంతా నిస్సత్తువ ఆవహించింది. నడిచే ఓపిక కూడా లేక రిక్షా ఎక్కి ఇల్లు చేరింది.

"అప్పుడే వచ్చేశావేమే?" ఆశ్చర్యంగా అడిగింది అనసూయమ్మ.

"సుజాతకు ఒంట్లో బాగా లేదటమ్మా! అందుకని మరొక రోజు వెళదాం అంది." తడుము కోకుండా అబద్ధం ఆడేసింది రాధ.

వెంటనే గదిలో టేబుల్ ముందు కూర్చుని, ఉత్తరంలోని శుభవార్త చదివి తనెంతగా సంతోషించిందీ, తరవాత రాకపోవటం వల్ల ఎంతగా నిరుత్సాహ పడిందీ సోదాహరణంగా వివరిస్తూ, సుదీర్ఘమైన లావు లేఖ వ్రాసింది రాధ. కవరు అంటించి, ఆ సాయంత్రమే స్కూలు నుంచి వచ్చిన తమ్ముడితో పోస్టులో వేయించింది.

ఇంచుమించు అదే సమయంలో మధు కూడా ఉత్తరం వ్రాశాడు. అది రెండవ రోజు ఉదయం రాధకు అందింది. అందులో అనేకమైన విషయాలు ముచ్చటించబడ్డాయి. ఆ వివరాలన్నీ ఇక్కడ అనవసరం. కథకు సంబంధించినంత వరకు—

"తప్పు నాది కాదు! మా ఆఫీసర్ రాక్షసుడిది. వాడొక దుర్మార్గుడు. కర్కోటకుడు. మొదట సెలవు అడిగితే — దాని దేముంది? అలాగే —అనేశాడు తేలికగా. ఆ భరోసాతోనే నీకు ఉత్తరం వ్రాశాను. తీరా మోసి సెలవు చీటీ వ్రాసి ఇస్తే — నిర్దాక్షిణ్యంగా 'నో' అనేశాడు. వాడిది నోరు కాదు, మరి. ఎంతగా బతిమాలినా ఫలితం లేకపోయింది. కోపం వచ్చింది. ఏడుపు వచ్చింది. కాని, ఏం చెయ్యగలను? ఈ ఆలోచన కాస్త ముందుగా వచ్చి ఉంటే పోయిన ఆదివారమే వచ్చి ఉందును. సరే, అయిం దేదో అయిపోయింది. రేపు వచ్చే ఆదివారం అదే టైముకు తప్పకుండా వస్తాను. ఆదివారం నాకు సెలవే కనక హరిహరాదులు కూడా అడ్డలేరు నన్ను. నాకు తెలుసు— మధ్యలో నాలుగు రోజులు అడ్డు ఉన్నాయి. నాలుగు రోజులంటే మాటలా! నాలుగు యుగాలు— కాదు, కాదు — అంతకన్న ఎక్కువే! గడవటం చాలా కష్టం. అందుకనే మా ఆఫీసర్ గాడికే కనక నీలాంటి కూతురూ, నా లాంటి అల్లుడూ ఉండి, ఆషాఢవియోగం అనుభవిస్తూ, మనలాగే కలుసుకోవటానికి ప్రయత్నించి నట్టయితే, ఆ ప్రయత్నం విఫలమై పోయి, వాళ్ళిద్దరూ విరహాగ్నిలో పడి భస్మమై పోదురు గాక!— అని శపించి పారేశాను. పతివ్రతల శాపానికి ప్రభావం ఉన్నప్పుడు, పత్నీవ్రతుల శాపానికి మాత్రం ఎందుకు ఉండదూ?"

అదీ సంగతి! ★

(సంకేత స్థలంలో తన ప్రియుడు లేక పోవటం చూచి ఆర్తి వహించే నాయిక— విప్రలబ్ధ)

వచ్చే వారం
శృంగార నాయిక
ఖండిత

